# కనువిందుచేసిన కూచిపూడి నృత్యం

(కల్చరల్ కంట్రిబ్యూటర్)

విశాఖపట్నం, జనవరి 2 (న్యూస్‌టుడే): నేషనల్ హ్యాండ్లూం ఎక్స్‌పో-1995 ప్రారంభోత్సవం సందర్భంగా ఇందిరా ప్రియదర్శిని మున్సిపల్ కార్పొరేషన్ స్టేడియంలో మంగళవారం సాయంత్రం ఏర్పాటు చేసిన కూచిపూడి నృత్యకార్యక్రమం శోభాయమానంగా సాగింది. కూచిపూడి కళాక్షేత్ర విద్యార్థులు హేమశిల్ప, చైతన్య, కృష్ణమానస, విద్య, నీలిమ ఈ కార్యక్రమంలో సుందరమైన నర్తనంతో ప్రేక్షకులకు కనువిందుచేశారు.

కళాక్షేత్ర ప్రిన్సిపాల్ శ్రీమతి ఎ. బాలకొండలరావు నృత్యదర్శకత్వంలో సాగిన అప్సరసలు (రాగమాలిక) అంశం పురాతన దేవాలయాల్లోని శిల్పభంగిమలను తలపింపజేసింది. అలాగే భామాకలాపం (భైరవిరాగం- మిశ్రచాపుతాళం) అంశంలో నీలిమ చక్కని ఆంగికాభినయాలతో సొగసైన హస్త ముద్రలతో మెప్పించింది. అలాగే సారసుముఖి అంశంలో హేమశిల్ప, సొగసుగా మృదంగతాళము (శ్రీ రంజని) అంశంలో కృష్ణమానస, చైతన్య (పింకీ), ఒకపరికొకపరి (ఖరహరప్రియ) అంశంలో జి.విద్య అందమైన నర్తనంతో ప్రేక్షకులకు ఆనందం కల్గజేశారు.

శ్రీమతి ఎ. బాలకొండలరావు హరిరామమూర్తి (నట్టువాంగం), బి. వరహాలు (గాత్రం), కాంతిలాల్ (మృదంగం), ఎ. సత్యవిశాల్ (వయొలిన్), పట్రాయని నారాయణమూర్తి (వీణ), టి. అచ్యుతరావు (ఫ్లూట్), భరణి (ఆహార్యం) గాత్రవాద్య, సాంకేతిక సహకారమందిస్తూ ఈ ప్రదర్శనని విజయవంతంగా నడిపించారు. ఎ. కొండలరావు టీం మేనేజర్‌గా వ్యవహరించారు.

ప్రొఫెసరు ఎ. రామలింగశాస్త్రి అంతకు ముందు మాట్లాడుతూ ప్రాచీన చరిత్రగల చేనేత సంస్థ ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవ సమయంలో పురాతన శాస్త్రీయ నృత్యకళా ప్రదర్శన ఏర్పాటుచేయడం ప్రశంసనీయమన్నారు.